

# పాప పరిహారం

కొండ్రెగుల శ్రీనివాసరావు

ఎక్కువ డబ్బు ఉన్న వాళ్ళ దగ్గర చాలా తక్కువ మంచితనం ఉంటుందనే సూక్తి మా షావుకారు గారికి వర్తించదు.

ఎందుకంటే తన దగ్గర పనిచేసే మనుష్యుల్ని నమ్మటం వాళ్ళ స్వేచ్ఛని కొల్లగొట్టకుండా ఉండటం, ఆపదలో ఆదుకోవటం లాంటి సుగుణాలు ఆయనలో ఉండటం వల్లనే ఇన్నాళ్ళు ఆయన దగ్గర పనిచేయగలుగుతున్నాను.

ఆయనికి చాలా ఆస్తి ఉంది. అదంతా స్వార్జితం కాదు - పిత్రార్జితమే!

కాలం గడవటానికి తిని కూర్చుంటే బావుండదనో లేదా కూర్చుని తింటే కొండలే తరిగిపోతాయనో తెలియదు గాని మొత్తానికి మనిషి అన్నాక ఏదో ఒక వ్యాపకము ఉండాలి కాబట్టి భారీ పెట్టుబడితో మెయిన్‌రోడ్ జంక్షన్‌లో ఓ స్టేషనరీ షాపు ప్రారంభించారు ఆయన.

అయితే చాలామంది వ్యాపారస్తులకు మల్లే ఆయనకు ధనదాహం లేదు. తక్కువ ధర వస్తువుని ఎక్కువకు అమ్మేసి సంపాదించేయాలన్న తపన కూడా లేదు. వ్యాపారపరంగా ఎంతైతే అంత తప్ప ఒక్కపైసా కూడా ఎక్కువ తీసుకోడు ఆయన.

వేరొకరి సొమ్ము తను ఆశించనని అలాగే తన సొమ్మును వేరొకరికి ఊరకనే ఇచ్చేయనని తరచూ అంటూంటారాయన. కాని అవసరం వస్తే అరుదుగానైనా ఉదారంగా ప్రవర్తిస్తుంటారు.

ఇన్ని మంచి గుణాలు కలిగి వున్న మా షావుకారుగారు ఒక విషయంలో దారుణమైన తప్పు చేశారు. ఆయన ఎందుకు అలా ప్రవర్తించారో నాకిప్పటికీ అర్థం కాదు.

బస్సులు ఆగే స్థలం అక్కడికి దగ్గర కావడం వలన ప్రయాణీకులు తరచు నీడ కోసమని మా షాపుని ఆశ్రయించడం పరిపాటి.

ఆ రోజు కూడా ఎవరో ఒకరు వచ్చి పోతూనే వున్నారు.

మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఓ వ్యక్తి ఆదరాబాదరాగా మా షాపుకి వచ్చాడు.

అతని మొహంలోని దిగులుని నేను పసిగట్టకపోలేదు.

'సార్' అంటూ కాస్త తటపటాయించాడు.

'ఏమిటి?' షావుకారుగారు ప్రశ్నించారు.

'సార్! గంట క్రితం ఇక్కడో బ్యాగు మర్చిపోయాను. మీరేమయినా చూశారా?' విషాద వదనంతో అడిగాడు.

'బ్యాగా? ఇక్కడా? చూడలేదే?' మా షావుకారుగారు పెదవి విరిచేసారు.

నేను కాస్త కలవరపడ్డాను.

ఎందుకంటే బిజినెస్ ఖాళీ ఉన్న సమయంలో బయట నిలబడ్డ నాకు ఒక బ్యాగు కనపడింది.

కాసేపు చుట్టూ పరికించి ఎవరూ చూడటం లేదని నిర్ధారించుకున్నాక తీసాను. క్యూరియాసిటీతో జిప్ తీసి చూసేసరికి నా గుండె ఆగినంత పని అయ్యింది.

కట్టలు... నోట్ల కట్టలు...

ఒకటి కాదు రెండు కాదు ఏభై రూపాయల నోట్ల కట్టలు నాలుగు ఉన్నాయి. అంటే ఇరవై వేల రూపాయలు అన్న మాట! నా చేతులు చిన్నగా వణకసాగాయి.

పాపం... పారేసుకున్న అభాగ్యుడు ఎవ్వరో ఏ ఆపదలో కొట్టుమిట్టాడుతున్నాడో కూతురు పెళ్ళి కోసమో? కొడుకు ఉద్యోగం కోసమో? ఇంటి దగ్గర గుండెలు బాదుకొని ఎంతగా రోదిస్తున్నాడో? రకరకాలుగా సాగిపోతున్నాయి నా ఆలోచనలు.

ఎవరైతేనేం తిరిగి వస్తే ఆ అభాగ్యుడికి ఇచ్చేద్దాం అని నిశ్చయించుకొని మా షావుకారుగారికి విషయం అంతా చెప్పి బ్యాగు అప్పగించాను.

ఆయన కూడా నాలాగే బ్యాగు తెరచి చూశారు.

అతని కళ్ళు విభ్రాంతితో విశాలమవటం ఆ తరువాత మెచ్చుకోలుగా నావైపు చూడటం నాకు కాస్త గర్వకారణమనిపించింది.

నా నిజాయితీకి గుర్తింపు లభించినందుకు లోలోపలే సంతోషించాను.

'ఎవరో ఒహరు రాక మానరుగా ఇచ్చేద్దాములే!' అన్నారాయన నాతో.

అలాగే నన్నట్లు తలూపాను.

ఆ తరువాత ఎవరు వచ్చినా బ్యాగు గురించే అనుకొని ఆత్రంగా చూసేవాళ్ళం.

గంట గడిచాక అతను రావటం జరిగింది.

'సార్! అప్పుచేసి పట్టుకొస్తున్నాను. ఇరవై వేల రూపాయలు. ఇక్కడే... ఇదిగో ఇక్కడే పెట్టి రుమాలుతో మొహం తుడుచుకున్నాను. అంతలో బస్సు వస్తే గాబరాగా పరిగెత్తాను. నాకు బాగా గుర్తు. ఇక్కడే పెట్టాను మీరు తీసి ఉంటే దయచేసి నాకిచ్చేయరూ?' -కళ్ళంబడ నీళ్ళతో అభ్యర్థిస్తున్నాడు.

నేను అతడిని పరిశీలనగా చూశాను.

దుస్తులు నలిగి ఉన్నాయి. ముఖంలో విషాదపు మడతలు. ఎదిగిన పిల్లలు ఉన్న వయస్సు. ఆర్థికంగా చితికిపోయిన వాడిలా అగుపిస్తున్నాడు.

అతడి ఆవేదన నిజమేనని, అతడ్ని నమ్మాలని అనిపించింది నాకు. షావుకారుగారు కూడా అవీ ఇవీ ప్రశ్నించి తరువాత ఇచ్చేస్తారు. ఆయన నైజం నాకు తెలుసుగా!

'నా డబ్బు దొరకకపోతే నా కుటుంబం వీధిన పడుతుంది సార్... వీధిన పడుతుంది' వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

'పోవయ్యా! ప్రతీవాడు మా వద్దకు వచ్చి ఏదో నెపంతో ఏడ్వటం బాగా అలవాటయింది. నువ్వెక్కడో డబ్బులు మర్చిపోవడమేమిటి? మమ్మల్ని ఇలా వేధించడమేమిటి?' షావుకారు గదమాయించేరు.

'అలా కోపగించకండి సార్! నేను ఇక్కడే మర్చిపోయాను. మీరు కాకపోయినా మీ వాళ్ళెవరైనా తీశారేమో కనుక్కోండి సార్! దయచేసి నాకు సహాయం చేయండి మీ రుణం మర్చిపోలేను.'

'ఇదిగో మర్యాదగా పోతావా లేదా? బిజినెస్ టైంలో ఏమిటీ న్యూసెన్స్?' కోపంతో అరిచారు షావుకారు.

షావుకారు ఆగ్రహానికి అతడు కాస్త వెనుకకి జంకాడు.

ఏడిపించడం ఎందుకు ఆయన ఇక ఇచ్చేయవచ్చు కదా! అని అనుకుంటూ వుండగా కస్టమర్స్ రావడంతో బిజీ అయ్యాను.

కాసేపు గడిచేక తీరిక అయ్యేక అతడి గురించి వెతికాను.

అతను అక్కడే కాస్త దూరంగా మా షాపు కెదురుగా నిల్చొని ఉన్నాడు. అతడు మౌనంగా రోదిస్తూన్నాడని నాకు తెలుసు.

నాకు మనసు మనసులో లేకుండా పోతూంది. బిజినెస్ మీద కాన్‌సన్‌ట్రేషన్ నిలవటం లేదు. మా షావుకారి గారి ఆంతర్యమేమిటో అంతుచిక్కడం లేదు. ఆయన డబ్బు మనిషి కాదే! మరెందుకిలా జాప్యం? బ్యాగు ఏ రంగుదీ, ఎక్కడ మర్చిపోయినదీ అందులో ఉన్న మొత్తం ఎంతో, అన్నీ కరెక్టుగా చెబుతున్నప్పుడు దాని హక్కుదారుడు అతడో అతడు కాదోనన్న మా షావుకారుగారి సంశయం అర్థం లేనిదనిపించింది.

చీకటి పడినదాకా అతడు అక్కడే ఉన్నాడు.

ఆఖరిసారిగా వచ్చి షావుకారిగారి చేతులు పట్టుకుని ప్రాధేయపడ్డాడు.

అయినా సరే పాషాణం చలించలేదు. సరికదా కటువుగా కసురుకున్నాడు.

బిక్కమొహంతో అతడు ఎటుపోయినాడో తెలియలేదు.

తరువాత షావుకారు ఏవీ జరగనట్లే నాతో ప్రవర్తించారు.

ఆ రాత్రి నాకు నిదుర దూరమైంది కన్నుమూసినా తెరచినా ఆ అభాగ్యుడి రూపమే కళ్ళ ముందు కదలాడేది.

ఈ దారుణంలో నా ప్రమేయం కూడా లేకపోలేదు. షావుకారు అతడ్ని దభాయించేస్తూన్నప్పుడు 'ఇందాక బ్యాగు మీ చేతికిచ్చాను కదా!' అని నేను నిలదీయొచ్చుగా! కానీ నేను అలా చేయలేకపోయాను. షావుకారుని ఎదిరిస్తే నా ఉపాధి పోతూందేమోననే స్వార్థం కావచ్చు.

నిజాన్ని నిర్భయంగా చెప్పలేని నా నిస్సహాయత మీద నాకే అసహ్యం వేసింది.

ఆ తరువాత రోజు కూడా షావుకారు ఆ డబ్బు ప్రసక్తి నా దగ్గర తీసుకురాలేదు. ఏమీ జరగనట్లే ఉన్నారాయన.

దాదాపు వారం గడిచేక షాపు తరపున మొక్కుబడి ఉండటం వలన తిరుమల తిరుపతికి వెళ్ళాల్సి వచ్చింది మా షావుకారుగారి ఫ్యామిలీతో.

అయిష్టంగానే బయలుదేరాను.

దర్శనం కోసం క్యూలో నిలుచున్నప్పుడు-

'మూర్తీ! పాపం సొమ్ము మనకెందుకు? ఆనాడు బ్యాగుతో దొరికిన సొమ్ము హుండీలో వేసేద్దాం...' అన్నారాయన నాతో. నేను నివ్వెరపోయాను.

ఏమిటి ఇతని నైజం?

అవునో కాదోనన్న సంశయంతో హక్కుదారుడైన వ్యక్తిని ఆర్థికంగా బలిచేసేసి భగవంతుడికి విరాళం అర్పించడం నాకెందుకో మనస్కరించలేదు.

నేను చూస్తూండగానే ఆయన అదే బ్యాగుని స్వామి వారి హుండీలో వేసేశారు.

కాని ఆలోచిస్తున్న కొలది కొంతలో కొంత నయమేననిపిస్తోంది. తనది కానిదాన్ని తను ఆశించకపోవడం కాస్త మంచితనమే కదా! అని సరిపెట్టుకున్నాను.

రిటర్న్ జర్నీ ట్రైన్‌లో చేస్తున్నాము.

నిద్రలేమివలన కనురెప్పలు మూతలు పడుతున్నాయి. కాస్త కునుకు తీద్దామని బెర్త్ మీదకి వొరిగాను.

షావుకారుతో అతడి భార్య ఏదో మాట్లాడుతోంది. 'అన్నట్టు హుండీలో బ్యాగుతో ఎక్కువ డబ్బులే వేసినట్లున్నారు' అడిగింది ఆమె.

'ఆ కాలం కలసివస్తే ఆపాటి శాంతి అవసరమేలే!' అన్నాడాయన.

'మీ మాటలు అర్థం అయి ఛస్తే కదా! సరిగా చెబుదురూ?' అందామె.

'ఏం ఉందిలే! మొన్న లక్ష్మీదేవి కాళ్ళ దగ్గరకు వచ్చి వరించమన్నది. కాదనేయటానికి మూర్ఖున్ని కానుగా! పాపవిముక్తి కోసం ఓ వెయ్యి చిల్లర నోట్లు సమర్పించానులే!'

నేను స్థాణువయ్యాను.

నిద్రపోయాను అనుకున్నారు కాబోలు.

ఆయన నిజస్వరూపం తెలిసింది.

ఆ వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను.

పాప పరిహారంతో అతడు నన్ను మోసగించాడా? లేకా దేవుడ్ని మోసగించాడా?

మనుష్యుల కోసం డబ్బు కానీ, డబ్బు కోసం మనుష్యులు కాదుగా! మరి ఎందుకిలా దిగజారిపోతారు?

ట్రైన్ పరిగెడుతూనే ఉంది నా ఆలోచనల్లాగే.